క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

అడవిదేవులపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మసూద్ షరీఫ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తమ ప్రగతి నివేదికతో సకాలంలో హాజరుకావాలన్నారు.

రేపు మోడల్ స్కూల్ ఎస్ఎంసీ ఎన్నికలు

నిడమనూరు: నిడమనూరు ఆదర్శ పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలు బుధవారం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రంజిత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో పాల్గొనేందుకు గాను 6వ తరగతి నుంచి 8వ తరగతి చదివే విద్యార్థుల తల్లిదండ్రులు ఉదయం 11 గంటలకు స్కూల్‌కు రావాలని కోరారు.

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రేపు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని బుధవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, కౌన్సిలర్లు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిధిలోని ఇళ్లలో పెంచుకుంటున్న కుక్కలకు వాటి యజమానులు ఈ నెల 25వ తేదీన పశువైద్యశాలకు తీసుకెళ్లి వ్యాక్సిన్ వేయించాలని సూచించారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

హాలియా: హాలియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఫిరంగి రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంగ్లిష్, కామర్స్ సబ్జెక్టులు బోధించేందుకు పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. సంబంధిత పీజీ సబ్జెక్టుల్లో 55 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులు ఉంటే అర్హులని పేర్కొన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ కలిగిన వారితో పాటు బోధనా అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 27వ తేదీ సాయంత్రం 4గంటల లోగా కళాశాలలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటర్వ్యూ తేదీ దరఖాస్తు చేసిన అభ్యర్థులకు తెలియజేస్తామని తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

డిండి: మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన చాట్ల శారద ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. గ్రామ పంచాయతీ వర్కర్‌గా పనిచేస్తున్న మృతురాలి భర్త తిరుపతయ్యకు సోమవారం గ్రామస్తుల సహకారంతో సేకరించిన రూ.64,100 నగదుతో పాటు 100 కేజీల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో దోకురి రమేష్, నక్క తిరుపతయ్య, అనుపటి వెంకటయ్య, ఎండీ బాషా, ఆంజనేయులు, వేముల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ కుటుంబానికి..

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ అర్బన్ ఐసీడీఎస్ పరిధిలోని అన్నారం సెక్టార్‌లో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్న విజయలక్ష్మి ఈ నెల 20న మృతి చెందింది. సోమవారం మహిళా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మృతురాలి భర్త చకిలం శ్రీనివాసరావుకు రూ.20వేల చెక్కును మిర్యాలగూడ అర్బన్ ఐసీడీఎస్ సీడీపీఓ మమత చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ జూనియర్ అసిస్టెంట్ రాములు, సూపర్‌వైజర్లు వి. సుశీల, రాధిక, అంగన్‌వాడీ టీచర్లు కవిత, సునీత, బొందు పార్వతి, సుజిత తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



కేవీపీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఎస్పీ వెంకటగిరి

మిర్యాలగూడ అర్బన్: కులవివక్ష పోరాట సమితి(కేవీపీఎస్) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం డీఎస్పీ పి. వెంకటగిరి మిర్యాలగూడ పట్టణంలోని తన కార్యాలయంలో సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రెమడాల పరశురాములు, రోడిరెక్క మల్లయ్య, రాధిక, దైద దేవయ్య, శ్యాం తదితరులున్నారు.

సామాజిక తనిఖీకి సహకరించాలి

మిర్యాలగూడ: గ్రామాల్లో నిర్వహించనున్న సామాజిక తనిఖీకి పంచాయతీ కార్యదర్శులు సహకరించాలని ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి అన్నారు. సోమవారం మిర్యాలగూడ ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి కార్యదర్శి ఆడిట్ రికార్డులు సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ గంగరాజు, డీఆర్‌పీలు, ఎంపీఓ వీరారెడ్డి, ఏపీఓ కళావతి, కార్యాలయ పర్యవేక్షకులు పి. కరుణాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన రామ నామస్మరణ



నిడమనూరు: కాషాయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు



పెద్దవూరలో ఎల్ఈడీ స్క్రీన్‌పై అయోధ్య బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్టను వీక్షిస్తున్న భక్తులు

హాలియా: అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ట మహోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం హాలియా మున్సిపాలిటీతో పాటు అనుముల మండలంలోని గ్రామాలు రామ నామస్మరణతో మార్మోగాయి. హాలియా పట్టణంలోని సీతారామాలయంలో తారక మంత్రం, హనుమాన్ చాలీసా పఠనం, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో స్క్రీన్ ఏర్పాటు చేసి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని ప్రసారం చేశారు. టైం స్కూల్, లక్ష్య స్కూల్, కృష్ణవేణి, న్యూకిడ్స్ స్కూల్ చిన్నారులు వేషధారణలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు మన్నెం రంజిత్‌యాదవ్, డాక్టర్ రవికుమార్, ఆలయ చైర్మన్ మోహన్‌రావు, గౌరవ అధ్యక్షుడు కాకునూరి నారాయణగౌడ్, అయోధ్య రామజన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్టు జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడలో..

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని రెడ్డికాలనీలో గల శ్రీకోదండరామాలయంలో భక్తులు స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ దేశిడి శేఖర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ రేపాల పురుషోత్తంరెడ్డి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులున్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు..

మిర్యాలగూడ పట్టణంలోని శ్రీఅభయాంజనేయస్వామి, శ్రీకన్యకాపరమేశ్వరీ దేవాలయంలో స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా పెద్దబజారులో గల శ్రీరామ మందిరంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు తల్లం అశోక్ ఆధ్వర్యంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గౌరు శ్రీనివాస్, కర్నాటి ప్రభాకర్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

జై శ్రీరామ్ జెండావిష్కరణ..

మిర్యాలగూడ పట్టణంలోని 19వ వార్డు ముత్తిరెడ్డికుంటలో శివదుర్గ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జై శ్రీరామ్ జెండా, రాములవారి ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

పెద్దవూరలో..

పెద్దవూర: మండల కేంద్రంలోని కోదండరామాలయంలో స్క్రీన్ ఏర్పాటు చేసి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని ప్రదర్శించారు. అంతకుముందు స్వామివారికి కల్యాణం, హోమం నిర్వహించారు.



హాలియా: రామలక్ష్మణ, సీతాదేవి, హనుమంతుడి వేషధారణలో న్యూకిడ్స్ స్కూల్ చిన్నారులు



మిర్యాలగూడ టౌన్: అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, మాజీ ఎంపీపీ రమావత్ శంకర్‌నాయక్, బీజేపీ రాష్ట్ర నాయకుడు మన్నెం రంజిత్‌యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పబ్బు యాదగిరిగౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి అభిషేకం

మిర్యాలగూడ: మండలంలోని భాగ్యగోపసముద్రం తండాలో అభయాంజనేయస్వామికి భక్తులు అభిషేకాలతో పాటు మహా భోగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనావత్ శంకర్ నాయక్, ధనావత్ చిన్యానాయక్, గురుస్వామి, ధనావత్ పుల్సి తదితరులు పాల్గొన్నారు.

అవంతీపురం రామాలయంలో పూజలు..

మిర్యాలగూడ మండలంలోని అవంతీపురం శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గల రామాలయంలో ఆలయ కమిటీ సభ్యులు అభిషేకాలు, రామాయణ పారాయణం, కుంకుమ పూజ, అష్టోత్తరాలు, దీపారాధనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ శరత్‌బాబు, కరుటూరి రామచంద్ర ప్రసాద్, అర్చకులు పాల్గొన్నారు.

వేములపల్లిలో..

వేములపల్లి: మండలంలోని రామాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు గ్రామాల్లో బైక్ ర్యాలీలు నిర్వహించడంతో పాటు అన్నదానాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చిర్ర సాంబమూర్తి, చల్లా సీతారాంరెడ్డి, జవ్వాజి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాడుగులపల్లిలో..

వేములపల్లి(మాడుగులపల్లి): మాడుగులపల్లి మండలంలోని కేశవాపురం రామాలయంలో టీవీ ద్వారా ప్రాణ ప్రతిష్టను వీక్షించారు. తోపుచర్ల, గజలాపురం గ్రామాల్లో భక్తులకు అన్నదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్ మంగా యాదయ్య, మాజీ సర్పంచ్ గున్‌రెడ్డి గోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిలో..

చింతపల్లి: మండల కేంద్రంలో ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. గ్రామ పురవీధుల గుండా శ్రీరామచంద్రమూర్తుల విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆయా దేవాలయ కమిటీలు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కోదండరామాలయంలో ప్రత్యేక పూజలు

త్రిపురారం: మండలంలోని కోదండరామాలయంలో పూజారి జీడికంటి నరేంద్రచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ అనుముల పాండమ్మ, సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడవిదేవులపల్లిలో భక్తులకు అన్నదానం..

అడవిదేవులపల్లి: మండల కేంద్రంతో పాటు చిట్యాల గ్రామంలో గ్రామస్తులు, యువత స్వచ్ఛందంగా ప్రజలకు అన్నదానం నిర్వహించారు. మండల కేంద్రంలోని దాసాంజనేయస్వామి ఆలయంలో మాజీ ఎంపీపీ కూరాకుల మంగమ్మచినరామయ్య, ఎస్ఐ హరిబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బస్టాండ్‌లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కూరాకుల గోపినాథ్, పెద్దింటి ఏడుకొండలు, పోలు నాగార్జున, గండు సాంబశివరావు, ఆనంద్, చిట్టిపల్లి చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గుర్రంపోడులో..

గుర్రంపోడు: మండలంలోని పలు దేవాలయాల్లో సామూహిక శ్రీరామ సంకీర్తనలు, భజనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొప్పోలు రామాలయంలో బాలలు సీత, రాముడు, లక్ష్మణుడు, హనుమంతుడు వేషధారణలో ఆకట్టుకున్నారు.

నాగార్జునసాగర్‌లో..

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ డ్యాం ప్రత్యేక భద్రత సిబ్బంది (ఎస్‌పీఎఫ్ పోలీసులు) స్థానిక కమలానెహ్రూ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు ప్యాకెట్లు పంపిణీ చేశారు. అన్ని ఆలయాల్లో అన్నదానం నిర్వహించారు.

కొండమల్లేపల్లిలో..

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని శ్రీసీతారామ చంద్రమౌళీశ్వరస్వామి దేవాలయంలో ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి ప్రసారం చేశారు. మండలంలోని ఆయా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నాయిని మాధవరెడ్డి, లింగారెడ్డి, చల్లా ధనంజయ్య, బూడిద వెంకటేష్ యాదవ్, సాంబశివగౌడ్, సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌గౌడ్, ఉప సర్పంచ్ గంధం సురేష్, ఎంపీటీసీ చెనగోని శివ, భక్తులు పాల్గొన్నారు.

డిండి మండలంలో..

డిండి: మండల కేంద్రంలోని శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లోని దేవాలయాల్లో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్లపై బాలరాముడి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని భక్తులు తిలకించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సాయమ్మ, ఎంపీటీసీ రాధిక, కేశవులు, ఏటి కృష్ణ, దినేష్, సురేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నిడమనూరులో..

నిడమనూరు: మండల కేంద్రంతో పాటు శాఖాపురం గ్రామంలో రామాలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు.



వేములపల్లి: మొల్కపట్నం రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



నాగార్జునసాగర్: కమలానెహ్రూ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న ఎస్‌పీఎఫ్ కానిస్టేబుళ్లు



చింతపల్లి: సాయి మందిరంలో ఉత్సవ విగ్రహాలను తీసుకొస్తున్న అర్చకులు, భక్తులు



మిర్యాలగూడ: భాగ్యగోపసముద్రం తండాలో అభిషేకం చేస్తున్న భక్తులు



గుర్రంపోడు: కొప్పోలులోని రామాలయంలో పూజలు చేసిన గ్రామస్తులు



డిండి: అయోధ్య రామమందిర నమూనా ముగ్గు వేస్తున్న ఎంపీటీసీ రాధిక



అడవిదేవులపల్లిలో అన్నదానం చేస్తున్న మాజీ ఎంపీపీ కూరాకుల మంగమ్మ, ఎస్ఐ హరిబాబు



త్రిపురారం: కోదండరామాలయంలో పూజల్లో పాల్గొన్న ఎంపీపీ, సర్పంచ్, భక్తులు



కొండమల్లేపల్లి: దేవాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మహిళలు



మాడుగులపల్లి: స్వామివారి చిత్రపటానికి పూజలు చేస్తున్న భక్తులు

యూటీఎఫ్ మండల కమిటీల ఎన్నిక

పెద్దవూర: యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్(యూటీఎఫ్) మండల నూతన కమిటీని సోమవారం పెద్దవూర మండల కేంద్రంలో నిర్వహించిన మండల మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎస్‌కే సయ్యద్‌మియా, ప్రధాన కార్యదర్శిగా రమావత్ కృష్ణ, ఉపాధ్యక్షులుగా కొండోజు మహేష్, బ్యూలా, కోశాధికారిగా బి. శ్రీనివాసరావు, సోషల్ మీడియా కన్వీనర్‌గా కె. నర్సింహ, మహిళా కన్వీనర్‌గా వజ్రమ్మను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ.. నూతన ప్రభుత్వమైనా ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మినిమం బేసిక్ పే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల పరిశీలకులుగా కె. విజయలక్ష్మి, ఎన్నికల అధికారిగా వడిత్య రాజు వ్యవహరించారు. కార్యక్రమంలోసహదేవి, రామకృష్ణారెడ్డి, సైదయ్య, లచ్చిరాం, మురళీ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరిలో..

తిరుమలగిరి(నాగార్జునసాగర్): టీఎస్ యూటీఎఫ్ తిరుమలగిరి మండల నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎరనాగుల సైదులు, ప్రధాన కార్యదర్శిగా గంజి శ్రీదేవి, కోశాధికారిగా నోముల నాగేందర్, ఉపాధ్యక్షులుగా పత్తిపాటి వినయ్‌కుమార్, బానోతు కుమారి, మహిళా కన్వీనర్‌గా షేక్ జానీబేగం, సోషల్ మీడియా కన్వీనర్‌గా అనుముల రవీందర్‌బాబు, కుటుంబ సంక్షేమ కన్వీనర్‌గా శైలజ, కార్యదర్శులుగా రావుల విజయలక్ష్మి, లావుడి భూపతి, బానోతు మంగ ఎన్నికయ్యారు.

కాలుష్యంతో పంట పొలాలు దెబ్బతింటున్నాయి

మిర్యాలగూడ: దామరచర్ల మండలం వాడపల్లి వద్ద గల రాశీ సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే కాలుష్యం వలన పంట పొలాలు దెబ్బతింటున్నాయని, భూగర్భజలాలు కలుషితమవుతున్నాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. సోమవారం ఆయన దామరచర్లలో విలేకరులతో మాట్లాడుతూ.. ఫ్యాక్టరీ ఏర్పాటులో భూములు కోల్పోయిన వారికి గతంలో ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఫ్యాక్టరీ యాజమాన్యం మోసం చేసిందని ఆరోపించారు. ఫ్యాక్టరీ నుంచి వచ్చే కాలుష్యం వలన చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేయాలని కోరారు. బ్లాస్టింగ్ నిర్వహించడం వల్ల ఇళ్లు దెబ్బతింటున్నాయని అన్నారు. ఫ్యాక్టరీపై చర్యలు తీసుకోవాలని కోరారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

వేములపల్లి: బాలికలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ అన్నారు. సోమవారం వేములపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన బేటీ బచావో– బేటీ పడావో కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సునీత, రజని, నాగమణి, హెల్త్ సూపర్‌వైజర్ శాంతమ్మ, అబ్దుల్లా, ప్రిన్సిపాల్ ఖాన్, అంగన్‌వాడీ టీచర్లు, బాలికలు పాల్గొన్నారు.

విచారణ చేపట్టాలి

మిర్యాలగూడ: కొండమల్లేపల్లిలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని భార్గవి మృతిపై ప్రభుత్వం విచారణ చేపట్టాలని దామరచర్ల ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వీరన్న నాయక్ అన్నారు. సోమవారం ఆయన దామరచర్లలో విలేకరులతో మాట్లాడుతూ.. పాఠశాలలో ప్రార్థన చేస్తుండగా భార్గవి కళ్లు తిరిగి పడిపోగా.. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల ప్రిన్సిపాల్‌ను ప్రభుత్వం వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మృతిచెందిన విద్యార్థిని కుటుంబానికి రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం కల్పించాలన్నారు. కార్యక్రమంలో అనిత, మానస, కీర్తి, రమేష్, కార్తీక్, వంశీ, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



దేవరకొండ: సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రోగులకు వైద్యులు 24గంటలలు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల పట్ల ప్రజలకు భరోసా కల్పించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. ప్రాంతీయ ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేసేందుకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీపీలు నల్లగాసు జాన్‌యాదవ్, దూదపాల రేఖాశ్రీధర్‌రెడ్డి, డీసీహెచ్ఎస్ మాతృనాయక్, సూపరింటెండెంట్ రాములునాయక్, ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

అభినందించిన ఎమ్మెల్యే..

డిండి: కర్ణాటక రాష్ట్రంలోని మాండ్యాలో ఈ నెల 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు జరగనున్న అండర్–19 జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు డిండి మండలంలోని చెర్కుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన రాఘవి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంరెడ్డి తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనడానికి సోమవారం కర్ణాటకకు బయల్దేరిన రాఘవిని, కోచ్ లెనిన్‌బాబును దేవరకొండలో ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అభినందించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర జనరల్ సెక్రటరీ భిక్షంగౌడ్, ఎంఈఓ సామ్యానాయక్, చంద్రయ్య, తస్లీమా, ఇద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

అస్సాం సీఎం దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నేతలు

హాలియా: అస్సాం రాష్ట్రంలో ఏఐసీసీ నాయకుడు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్రను అడ్డుకోవడాన్ని నిరసిస్తూ సోమవారం హాలియా పట్టణంలో యువజన కాంగ్రెస్ నాయకులు ఆ రాష్ట్ర సీఎం హిమంత బిశ్వ శర్మ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గౌనీ రాజారమేష్‌యాదవ్ మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్రను బీజేపీ కార్యకర్తలు అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకునూరి నారాయణగౌడ్, యువజన కాంగ్రెస్ నాయకులు అనుముల అంజి, కాసర్ల గిరి, మహేష్, జినుకల శ్రీను తదితరులు ఉన్నారు.

ఘనంగా ప్రారంభమైన ఉర్సు



చాదర్ కప్పుతున్న నాయకులు

చింతపల్లి: మండలంలోని పోలేపల్లి రాంనగర్ గుట్టపై కొలువుదీరిన గట్టు పీర్ల ఉర్సు సోమవారం ఘనంగా ప్రారంభమైంది. తెల్లవారుజామున ఒంటెపై గంధం ఊరేగింపు కొనసాగగా.. గుట్టపై ఉన్న గట్టు పీర్లను దర్శించుకునేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన నాయకులు

మిర్యాలగూడ టౌన్: రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సోమవారం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో మిర్యాలగూడకు చెందిన బీసీ సంఘం, గౌడ సంఘం నేతలు కలిసి ఘనంగా సత్కరించారు. రాష్ట్రంలో కుల గణన చేపట్టాలని, బీసీ రిజర్వేషన్లు జనాభా ప్రాతిపదికన పెంచాలని, నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు అధిక ప్రాధాన్యత కల్పించాలని మంత్రిని కోరారు. మంత్రిని కలిసిన వారిలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొలగాని వెంకటేష్‌గౌడ్, గుండు నరేందర్‌గౌడ్, చౌగాని వెంకన్నగౌడ్, వాటిపాక వినయ్ తదితరులున్నారు.

'చలో ఢిల్లీ' కరపత్రం ఆవిష్కరణ



'చలో ఢిల్లీ' కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్: వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమం కరపత్రాన్ని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ.. జనాభా ప్రాతిపదికన బీసీలకు రాజ్యాంగబద్ధంగా రావాల్సిన హక్కులు రావడం లేదన్నారు. చట్టసభల్లో బీసీలకు 50శాతం వరకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, బీసీల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లపై క్రీమీలేయర్ ఎత్తివేసి ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. ఫిబ్రవరి 5, 6వ తేదీల్లో చేపట్టనున్న పార్లమెంట్ ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంమలో సంఘం నాయకులు శ్రీనివాస్, మురళియాదవ్, నర్సింహ, గంగాధర్, నరేష్, కోల అశోక్, అనిల్ తదితరులున్నారు.

భక్తిభావం పెంపొందించుకోవాలి



ఆలయ అభివృద్ధికి ఆర్థికసాయం అందజేస్తున్న బుసిరెడ్డి పాండురంగారెడ్డి

త్రిపురారం: సమాజంలో ప్రతిఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి అన్నారు. అయోధ్య రామమందిరంలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం సందర్భంగా సోమవారం త్రిపురారం మండలంలోని కొణతాలపల్లి గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఆయన గ్రామంలోని శ్రీసీతారామాంజనేయ ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి ఆయన రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. అనంతరం బుసిరెడ్డి పాండురంగారెడ్డిని గ్రామస్తులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జొన్నలగడ్డ వెంకట్‌రెడ్డి, నెల్లికల్ సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, జొన్నలగడ్డ వేణుగోపాల్‌రెడ్డి, రమణారెడ్డి, బలరాంరెడ్డి, మైనంపాటి దామోదర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, దూపాటి భిక్షం, సంద్రాల సైదులు, పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.